క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలి


మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈవో

లింగపాలెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సింగగూడెంలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని సమగ్ర శిక్ష ఇన్‌ఛార్జ్ సీఎంవో మండల విద్యాశాఖ అధికారి జంగం రవీంద్ర మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం ఉండాలని సూచించారు. భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. భోజనం ఎలా ఉంది అని విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా వంట ఏజెన్సీ వారితో ఎంఈవో మాట్లాడుతూ వంట చేసే పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలని పాత్రలు శుభ్రంగా ఉంచుకోవాలని, వంట గది ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎంఈవో వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుర్ర శ్రీధర్, సీఆర్‌పీ కనకరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

దెందులూరు: అక్కిరెడ్డిగూడెంలో నివసిస్తున్న యువ్వనపూడి నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులకు సొంత గూడు లేక ఇబ్బంది పడుతున్నారు. కొబ్బరి మట్టలతో వారు ఏర్పాటు చేసిన గుడెసెలో విద్యుత్ వంటి కనీస సౌకర్యం కూడా లేదు. దశాబ్ద కాలంగా దెందులూరు నియోజకవర్గంలో పేదలకు, రోగులకు ఆపన్న హస్తం అందిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ చేయూత సభ్యులు వారి ఇంటికి వెళ్లి అక్కడి పరిస్థితులు చూసి స్పందించి రూ.10 వేలు నగదు, నిత్యావసర వస్తువులను సోమవారం అందజేశారు. మేకా లక్ష్మీనారాయణ, పరసా నాగార్జున, ఏనుగు రామకృష్ణ, మరీదు లక్ష్మణ రావు, గంగుల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

29న దివ్యాంగుల నిర్ధారణ శిబిరం

దెందులూరు: దెందులూరు గారపాటి హైమావతిదేవి ఉన్నత పాఠశాలలో ఈ నెల 29న దివ్యాంగుల నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.శ్రీలత, ఎంఈఓలు ఏవీఎన్‌వీ ప్రసాద్, కె.అన్నమ్మ అన్నారు. మంగళవారం దెందులూరు ఎంఆర్‌సీ కార్యాలయంలో ప్రత్యేక అవసరాలుగల చిన్నారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీడీవో, ఎంఈవోలు మాట్లాడుతూ దివ్యాంగులైన బాల బాలికలకు వైద్యులు పరీక్షలు చేసి వారి అవసరాలకు ఉపకరణాలు అందజేస్తారన్నారు. మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సదరం, రేషన్ కార్డు జెరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు. బుద్ధి మాంద్యం గల పిల్లలకు కుల ధ్రువీకరణ పత్రం (పాతదైనా పర్వాలేదు) యూడీఐడీ కార్డు జెరాక్స్ కాపీలు, 4 ఫొటోలు తీసుకురావాలన్నారు.

పెంకుటిల్లుపై కూలిన తాటిచెట్టు.. బాలికకు గాయాలు


ఇంటిపై పడిన తాటిచెట్టు


గాయపడిన బాలిక

కామవరపుకోట: గొల్లగూడెలో మంగళవారం వర్షంతో కూడిన ఈదురు గాలులకు తాడిచెట్టు పెంకుటిల్లుపై కూలిన ఘటనలో ఓ బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కామవరపుకోట పంచాయతీ గొల్లగూడెంకు చెందిన నీలపాల సీతామహాలక్ష్మి బంధువులతో కలిసి తన ఇంట్లో ఉండగా, మంగళవారం వర్షంతో కూడిన ఈదురుగాలులు వీచటంతో, ఇంటి పక్కనే ఉన్న తాటిచెట్టు కూలి పెంకుటిల్లుపై పడింది. దీంతో ఇంటి పైకప్పునకు ఉన్న తాటివాసాలు విరిగి వీరిపై పడ్డాయి. ఈ ఘటనలో బంధువు బాలిక సరితకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను సమీప ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనపై రెవెన్యూ అధికారులు వివరాలు ఆరా తీశారు.

పశువులకు హెచ్‌ఎస్ వ్యాక్సిన్

దెందులూరు: పోతునూరు పశు వైద్యశాల పరిధిలో హెచ్‌ఎస్ వ్యాక్సిన్ (దొమ్మ టీకా)ను గేదెలు, ఆవులకు వేస్తున్నామని పశు వైద్యశాఖ జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సీహెచ్ శ్రీరాములు తెలిపారు. మంగళవారం పోతునూరులో పశువైద్యశాఖ ఆదేశాలకు అనుగుణంగా గేదెలు, ఆవులు సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ప్రతి గ్రామంలో హెచ్‌ఎస్ వ్యాక్సిన్ వేస్తామన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోతునూరు పశువైద్యశాఖ పరిధిలో 2,240 గేదెలు, ఆవులు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 70 శాతం వ్యాక్సిన్లు వేశామన్నారు. పశువులకు వ్యాక్సిన్లు వేయించకుంటే గొంతువాపు వచ్చే ప్రమాదం ఉందని జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ శ్రీరాములు అన్నారు.

ఘనంగా 'నేను బడికి పోతా'


మక్కినవారిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

టి నరసాపురం: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి, నాణ్యతమైన విద్యను అందిస్తున్నామని మక్కినవారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్.వెంకటేశ్వరరావు తెలిపారు. మక్కినవారిగూడెంలో నేను బడికి పోతా కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ప్రధాన సెంటర్ వరకు పిల్లలు బడిలో ఉండాలి అనే నినాదంతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీను, రాములు, శరత్‌బాబు, వాసు, మంజరీ దేవి, సుమతీ రత్నం, ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి

లింగపాలెం: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. మఠంగూడెం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీగా ఇంటింటికి వెళ్లి బడికి పోదాం భవితను మార్చుకుందాం, పిల్లల చదువు భవితకు వెలుగు, మన ఊరి బడి మన పాలిట గుడి, బాల్య వివాహాలు వద్దు చదివే ముద్దు అనే నినాదాలతో ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూక్యా కృష్ణ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అనీమియాపై అవగాహన సదస్సు


బయ్యన్నగూడెం పీహెచ్‌సీలో అనీమియాపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: సికిల్ సెల్ (అనీమియా) వ్యాధిపై అవగాహన సమావేశం బయ్యన్నగూడెం పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించారు. వైద్యాధికారులు వీ.సత్యనారాయణ ఎం.గీతారాణి ఈ సందర్భంగా సికిల్ సెల్ (అనీమియా) వ్యాధి లక్షణాలు, సంక్రమించే విధానం, రోగులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. రక్త కణాలు కొడవలి ఆకారంలోకి మారడం వలన రక్తం సరఫరాకి అంతరాయం కలుగుతుందన్నారు. గుండెకు సకాలంలో ఆ రక్తం సరఫరా కాకపోవడంతో ఆక్సిజన్ అందక శ్వాస ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. రక్త కణాలు దాదాపు 120 రోజులు బ్రతుకుతాయని సికిల్ సెల్ (అనీమియా) వ్యాధి ఉన్నవారిలో రెండు రోజులకు మించి బ్రతకవని, తరచూ రక్తం ఎక్కించుకోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రమణ్యం, హెచ్‌వీకే మరియమ్మ, సిబ్బంది ఎస్కే మున్ని, సుబ్బారావు, జనార్ధన్‌రావు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

గ్రీష్మతాపానికి ప్రజలు బెంబేలు


కొయ్యలగూడెం మెయిన్ సెంటర్ జాతీయ ప్రధాన రహదారి నిర్మానుష్యంగా ఉన్న దృశ్యం

కొయ్యలగూడెం: గ్రీష్మ తాపానికి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.నాలుగు రోజులుగా వేసవిని తలపిస్తున్న ఎండలు దానికి తోడు వాతావరణంలో ఉక్కపోత, వడగాడ్పులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మంగళవారం భానుడి భగభగలకు జాతీయ ప్రధాన రహదారి కర్ఫ్యూను తలపించే విధంగా మారింది. ఎన్నడు లేని విధంగా తరచూ దాహార్తులతో జనాలు గొంతులు తడుపుకుంటున్నారు. శీతల పానీయ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. స్కూలు ప్రారంభమై వారం రోజులు అవుతున్న విద్యార్థులను పంపడానికి తల్లిదండ్రులు సంకోచిస్తున్నారు. ఈ పరిస్థితి ఇంకా ఎంతకాలం ఉంటుందో వరుణుడు ఎప్పటికీ కరుణిస్తాడో, వాతావరణం ఎప్పటికీ చల్లబడుతుందోనని ప్రజలు ఆత్రుతతో ఆకాశం వంక ఎదురు చూస్తున్నారు.

సమ్మర్ అలవెన్సులు ఇవ్వాలి


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

జంగారెడ్డిగూడెం: ఉపాధి హామీ కూలీలకు సమ్మర్ అలవెన్సులతో కలిపి వేతనాలివ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మైసన్నగూడెం గ్రామంలో ఉపాధి హామీ పని చేసే సూరయ్య చెరువులో పర్యటించి కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సంఘం మండల కార్యదర్శి ఏ.ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా వేయటంతో ఉపాధి కూలీలు వడదెబ్బకు గురవుతున్నారని, తక్షణమే నీడకు చలువ పందిళ్లు, మంచినీళ్లు, మజ్జిగ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. తక్షణమే కూలీలకు సమ్మర్ అలవెన్సులతో వేతనాలు విడుదల చేయాలని, 200 రోజుల పని దినాలు పెంచి, రూ. 600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో సంఘం నాయకులు పిల్లి చంటి, జీ.సూర్యకిరణ్, పీ.పెద్దిరాజు, కే.వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై కౌన్సిలర్ల ధ్వజం


మున్సిపల్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో పారిశుద్ధ్య పనులు అధ్వాన్నంగా ఉన్నాయని కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. మంగళవారం చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో పలు సమస్యలపై కౌన్సిలర్లు నిలదీశారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, కౌన్సిర్లు కాసర తులసిరెడ్డి, వలవల తాతాజీ, పీపీఎస్ చంద్రరావు మాట్లాడుతూ పట్టణంలో శానిటేషన్ అధ్వాన్నంగా ఉందని ఆరోపించారు. పారిశుద్ధ్య సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించట్లేదని ఆరోపించారు. దీనిపై కమిషనర్ ఎస్.నరేంద్రకుమార్ పారిశుద్ధ్య సిబ్బంది తక్కువగా ఉన్నారని, ఔట్‌సోర్సింగ్‌లో సిబ్బందిని తీసుకుని పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చేందుకు కృషి చేస్తానని వివరణ ఇచ్చారు. వర్షాకాలం నేపథ్యంలో పట్టణంలో డ్రెయిన్లలో పేరుకుపోయిన సిల్ట్ తొలగించాలని వైస్ చైర్మన్ అంజి కోరారు. పట్టణంలో వీధి దీపాలు వెలగడం లేదని, వాటిని వెంటనే పునరుద్ధరించాలని కౌన్సిలర్‌లు కోరారు. దీనిపై కమీషనర్ నరేంద్ర కుమార్, ఏఈ సంధ్య వివరణ ఇస్తూ ఇప్పటి వరకు ప్రైవేట్ కాంట్రాక్టర్ వీధిలైట్ల నిర్వహణ చేపట్టారని, కాంట్రాక్టర్ సమయం ముగియడంతో సమస్యలు తలెత్తాయన్నారు. ఇకపై మున్సిపల్ సిబ్బందితో వీధి లైట్ల సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

మద్ది అంజన్నకు తమలపాకుల పూజ


మద్ది క్షేత్రంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురువాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామిని మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం ఒక్క రోజు రూ: 2,25,291 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. 1600 మంది భక్తులు స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు


సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మధుబాబు

చింతలపూడి: పిల్లలను పనికి కాకుండా, బడికి పంపించి, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బాల కార్మిక నిరోధక దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఆంథోనీ నగర్ ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాల బాలికలు తమ హక్కులను తెలుసుకోవాలన్నారు. 6 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల వయస్సు గల బాల, బాలికలు చదువుకోవాలని కోరారు. తల్లిదండ్రులు పిల్లలను పనులకు దూరంగా ఉంచాలని హెచ్చరించారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే జైలు శిక్షతో పాటు జరిమాన కూడ విధిస్తామని తెలిపారు.నిర్బంధ విద్యాహక్కు చట్టం ద్వారా బాలబాలికలు చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ.నాగేశ్వరరావు, న్యాయవాదులు ఉమర్ ఫరూఖ్, పీ.డేవిడ్ రాజు, కే.దుర్గా భవాని, సోషల్ వర్కర్ అక్బర్ ఆలి, తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం పూర్తికి కృషి

ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్


అభినందన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్

చింతలపూడి: చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ఆర్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, మాజీ సర్పంచ్ చిట్లూరి ధర్మరాజు, మాటూరి వెంకట్రామయ్య, బోడ నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించండి

విద్యార్థులకు మెరుగైన విద్య అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు, షూస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.కార్యక్రమంలో ఎంఈవో జీ.రామారావు, మాటూరి వెంకట్రామయ్య, నగర పంచాయితీ కార్యదర్శి బోడ నాగభూషణం, బీ.అనీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం


బోడిగూడెంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

కొయ్యలగూడెం: అంగన్‌వాడీ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు ప్రాథమిక పాఠశాలలో చేరే విధంగా ఐసీడీఎస్ శాఖ కృషి చేస్తోందని పీవో యూఎన్.స్వర్ణకుమారి పేర్కొన్నారు. మంగళవారం బోడిగూడెంలో అంగన్‌వాడీ చిన్నారులకు సూపర్‌వైజర్ నయోమీరాణి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ దుస్తులను ధరింప చేసి ప్రదర్శన నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఆదర్శ కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని ఐదు సంవత్సరాలు నిండిన చిన్నారులు బడి బాట పట్టే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సుమారు 15 మంది చిన్నారులను బోడిగుడెం ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు.

పీఎం కిసాన్ నిధుల విడుదల


ఆర్‌బీకే కేంద్రంలో పీఎం కిసాన్ నిధుల విడుదల లైవ్ టెలికాస్ట్‌ను రైతులకు ప్రదర్శిస్తున్న దృశ్యం

చింతలపూడి: రైతులకు ప్రయోజనం చేకూర్చే ఉద్దేశ్యంతో అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకంలో భాగంగా మొదటి విడత నిధులను మంగళవారం ప్రధాని నరేంద్ర మోడీ విడుదల చేసినట్లు వ్యవసాయశాఖ ఏడీఏ నాగకుమార్ తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చింతలపూడి సబ్ డివిజన్‌లో 30,105 మంది అర్హులైన రైతులకు రూ.6,02,10,000 నిధులను రైతుల ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 78 ఆర్‌బీకే కేంద్రాల్లో ప్రధానమంత్రి పీఎం కిసాన్ నిధులు విడుదల చేస్తున్న లైవ్ టెలికాస్ట్‌ను రైతులకు ప్రదర్శించినట్లు తెలిపారు. మండలాల వారీగా చింతలపూడి మండలంలో 9,023 మంది రైతులకు రూ.1,86,40,000, లింగపాలెం మండలంలో 7,004 మంది రైతులకు రూ.1,40,08,000, కామవరపుకోట మండలంలో 6,805 మంది రైతులకు రూ.1,36,10,000, టీ.నరసాపురం మండలంలో 7,273 మంది రైతులకు రూ.1,45,46,000 నేరుగా రైతుల ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. సాంకేతిక కారణాలతో పీఎం కిసాన్ నిధులు ఖాతాల్లో జమ అవ్వని రైతులు రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏవో మీనా కుమారి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం


దేవులపల్లిలో దుకాణంపై పడిన తాటిచెట్టు


గురవాయిగూడెంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలో మంగళవారం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో దేవులపల్లిలో ఒక దుకాణంపై తాటి చెట్టు విరిగిపడింది. అలాగే గురవాయిగూడెంలో వ్యాపార దుకాణంపై చెట్టుకొమ్మ పడింది. ఎవరికీ ఏమీ కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇదే గ్రామంలో ఒక విద్యుత్ స్తంభం నేలకొరిగింది. మరో విద్యుత్ స్తంభం బీటలు వారి ఒరిగింది. గ్రామాల్లో విద్యుత్ వైర్లు తెగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఈవీఎంలు లేని ఎన్నికల ప్రక్రియ చేపట్టాలి

కొయ్యలగూడెం: భారతదేశంలో ఈవీఎంలు లేని ఎన్నికల ప్రక్రియ చేపట్టాలని అవార్డు స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ పీ.వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచంలో నూట ఇరవైకి పైగా దేశాలు ఈవీఎంలను బహిష్కరించి బ్యాలెట్ పేపర్‌పై నేరుగా ఓటు హక్కును వినియోగించుకుంటున్నాయన్నారు. కానీ భారతదేశంలో ఈవీఎంలపై అనేక పార్టీలు సందేహం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో వాటిని ఎందుకు కొనసాగించాల్సిన ఆవశ్యకత ఉందో ప్రజలకు అర్థం కావడం లేదన్నారు. చూస్తుంటే ఈవీఎంల ప్రక్రియ కొనసాగించాలని చూస్తున్న రాజకీయ పార్టీల చిత్త శుద్ధిని సంకించాల్సి వస్తోందన్నారు. కోట్లాది మంది ఓటర్లు అందుకు తగ్గ విధంగా ఎలక్షన్ పోల్స్ నిర్వహించగలిగిన లక్షలాది సిబ్బంది ఉండగా ఈవీఎంల వ్యవస్థను అమలు చేయాలనుకోవడం దురుద్దేశం అవుతుందన్నారు. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తికి, చీఫ్ ఎలక్షన్ కమిషన్, భారత రాష్ట్రపతిలకు ఫిర్యాదు చేశామన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

టి.నరసాపురం: మండలంలోని రాజుపోతేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్న ఆర్‌డీఎస్ఎస్ పనుల కారణంగా ఈ నెల 19 నుంచి 21 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలుగుతాయని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పీ.రాధాకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

21న అంతర్జాతీయ యోగా దినోత్సవం

జంగారెడ్డిగూడెం: ది పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీగౌరీ సుభద్ర పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించనున్నట్లు పిరమిడ్ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు కాకి రామకృష్ణ, తటవర్తి కృష్ణ తెలిపారు. 21న ఉదయం ఆరు గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. వాకర్స్ క్లబ్, ఆధ్యాత్మిక సంస్థలు మరియు ఇతర యోగా, స్వచ్ఛంద సంస్థల సంయుక్త నిర్వహణలో జరిగే కార్యక్రమంలో యోగాసనాలు, ధ్యానం, సత్సంగం, ధ్యాన శిక్షణ పూర్తి చేసుకున్న చిన్నారులకు ధృవపత్రాలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆరోగ్యాభిలాషులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

యథేచ్ఛగా గుట్కా విక్రయాలు


దుకాణాల్లో విక్రయిస్తున్న గుట్కాలు

పెదవేగి : పెదవేగిలో నిషేధిత గుట్కాల అమ్మకాలు బహిరంగంగానే సాగుతున్నా పోలీస్, మండల పరిషత్, ప్రజారోగ్య విభాగ అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పెదవేగికి కూతవేటు దూరంలో ఉన్న ఏలూరు హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా నిషేధాజ్ఞలు ఉల్లంఘించి రెట్టింపు ధరలకు గుట్కా అమ్మకాలు కొనసాగిస్తున్నారు. వీరి వద్ద గుట్కాలను హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి వినియోగదారులకు విక్రయించే చిన్న వ్యాపారులు సైతం ప్యాకెట్ల ధరలు చూసి కళ్లు తేలేస్తున్నారు. ఇక గుట్కా వ్యసనపరుల విషయానికొస్తే అధిక ధరలకు కొనలేక అలవాటును మానుకోలేక జేబులు ఖాళీ చేసుకోక తప్పడం లేదు.

అన్నీ అధిక ధరలే

ప్రభుత్వం గుట్కా అమ్మకాలపై నిషేధాజ్ఞలు విధించడం దళారులకు కాసులవర్షం కురిపిస్తోంది. గతంలో రూపాయికి విక్రయించిన ఒక ప్యాకెట్‌ను ప్రస్తుతం 7 రూపాయలకు విక్రయిస్తూ వ్యసనపరుల జేబులు గుల్ల చేస్తున్నారు. బడ్డీ వ్యాపారులు అదే సింగిల్ ప్యాకెట్‌ను 10 రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు. ప్రతిరోజూ పట్టణంలో ఈ వ్యాపారం లక్షల్లో, మండలాల్లో వేలల్లో సాగుతోంది.

స్పందించని అధికార యంత్రాంగం

గుట్కా ప్యాకెట్ల విక్రయాలను అడ్డుకోవాల్సిన సంబంధిత అధికార యంత్రాంగం మండలంలో ఇంత వరకు ఏ ఒక్క దుకాణంపై దాడులు చేసిన దాఖలాలు లేవు. హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తూ, వారిచ్చే ముడుపులకు ప్రీతిపాత్రులు అవుతున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. గుట్కా ప్రియుల బలహీనత వల్ల గుట్కాలను బహిరంగంగానే అధిక ధరలకు విక్రయిస్తున్న హోల్‌సేల్, రిటైల్ ఆగడాలకు అధికారులు ఇప్పటికైనా అడ్డుకట్ట వేయాలని, నిషేధాజ్ఞలు పటిష్టంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.